# టిక్.. టిక్.. టిక్..

## నేడు తేలనున్న అభ్యర్థుల భవితవ్యం

- మరికొన్ని గంటల్లో ఉత్కంఠకు తెర
- ఓట్ల లెక్కింపునకు అధికారుల ఏర్పాట్లు
- గెలుపు గుర్రాలపై కొనసాగుతున్న బెట్టింగ్‌లు
- మధ్యాహ్నానికల్లా ఫలితాలు వెల్లడయ్యే అవకాశం
- నారాయణపేట నుంచే తొలి రిజల్ట్
- ఒక్కో సెగ్మెంట్‌లో 14 రౌండ్ల కౌంటింగ్
- విజయావకాశాలపై గులాబీదళం ధీమా..

మహబూబ్‌నగర్, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్‌కు కౌంట్ డౌన్ షురూ అయ్యింది. ఆదివారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని 12 నియోజకవర్గాల ఓట్ల లెక్కింపునకు జిల్లా అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఆయా జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాల్లో నియోజకవర్గాల ఓట్ల లెక్కింపునకు విస్తృత ఏర్పాట్లు చేశారు. మహబూబ్‌నగర్‌లోని పాలమూరు యూనివర్సిటీలో మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్ర నియోజకవర్గానికి సంబంధించిన ఓట్ల లెక్కింపు జరుగుతుంది. నారాయణపేటలోని శ్రీ దత్త బీఈడీ కాలేజీలో మక్తల్, నారాయణపేట నియోజకవర్గాలు, గద్వాలలోని పాలిటెక్నిక్ కాలేజీలో గద్వాల, అలంపూర్ నియోజకవర్గాలు, వనపర్తి సమీపంలోని చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో వనపర్తి నియోజకవర్గం, నాగర్‌కర్నూల్‌లోని నెల్లికొండి వద్ద ఉన్న అగ్రికల్చర్ కాలేజీలో నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్ నియోజకవర్గాలు, రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో కల్వకుర్తి నియోజకవర్గానికి సంబంధించిన ఓట్ల లెక్కింపు జరుగనున్నది. ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమవనుండగా తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కిస్తారు. ఆ తర్వాత రౌండ్ల వారీగా నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు ఉంటుంది. ఒక్కో నియోజకవర్గంలో సుమారు 14 రౌండ్ల పాటు ఓట్లను లెక్కిస్తారు. 12 నియోజకవర్గాల్లో తొలి ఫలితం నారాయణపేట నియోజకవర్గం నుంచి వెలువడే అవకాశం ఉన్నది. ఎందుకంటే ఈ నియోజకవర్గంలో కేవలం ఏడుగురు అభ్యర్థులే బరిలో నిలిచారు. ఇక గద్వాల, కల్వకుర్తి నియోజకవర్గం ఫలితాలు ఆలస్యంగా వెలువడే అవకాశం ఉంది. ఈ రెండు నియోజకవర్గాల్లో రెండేసి ఈవీఎంలను ఉపయోగించారు. మిగతా నియోజకవర్గాల్లో నోటాతో కలిపి ఒక్కో ఈవీఎంను మాత్రమే ఓటింగ్‌కు ఉపయోగించారు. 15మంది అభ్యర్థుల ఓట్లను రౌండ్‌ల వారీగా లెక్కించాల్సి ఉంటుంది కాబట్టి ఆలస్యం అయ్యే అవకాశం ఉన్నది. మధ్యాహ్నానికే ఎవరు గెలుస్తారనేది అంచనాకు వచ్చే అవకాశం ఉంది. ఉమ్మడి జిల్లాలో మరోసారి సత్తా చాటుతామని గులాబీ శ్రేణులు ధీమాతో ఉన్నారు. ఎన్నికల కౌంటింగ్ దృష్ట్యా మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల, నారాయణపేట జిల్లాకేంద్రాల్లో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఆయా జిల్లా ఎస్పీలు ప్రకటించారు. అనుమతి లేనిది ర్యాలీలు నిర్వహించరాదని పోలీస్ యంత్రాంగం సూచించింది.

### ఉమ్మడి జిల్లాలో టేబుళ్లు, రౌండ్ల వివరాలు..

| నియోజకవర్గం | టేబుళ్లు | రౌండ్లు |
|---|---|---|
| కొడంగల్ | 14 | 20 |
| నారాయణపేట | 14 | 20 |
| మహబూబ్‌నగర్ | 14 | 20 |
| జడ్చర్ల | 14 | 20 |
| దేవరకద్ర | 14 | 21 |
| మక్తల్ | 14 | 21 |
| వనపర్తి | 14 | 22 |
| గద్వాల | 14 | 22 |
| అలంపూర్ | 14 | 21 |
| నాగర్‌కర్నూల్ | 14 | 19 |
| అచ్చంపేట | 14 | 20 |
| కల్వకుర్తి | 14 | 19 |
| షాద్‌నగర్ | 12 | 22 |
| కొల్లాపూర్ | 14 | 20 |

### కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని 12 నియోజకవర్గాల ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు చేశారు. ఆయా జిల్లాల హెడ్‌క్వార్టర్లలో సెగ్మెంట్ల వారీగా ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టనున్నారు. ఉదయం ఎనిమిది గంటలకు ఆయా రాజకీయ పార్టీలకు చెందిన పాస్‌లు ఉన్న కౌంటింగ్ ఏజెంట్లకు అనుమతిస్తారు. ఒక్కో నియోజకవర్గంలో 14 టేబుళ్లను ఏర్పాటు చేశారు. ప్రతి టేబుల్‌ను కౌంటింగ్ సూపర్వైజర్లు దగ్గరుండి మానిటరింగ్ చేస్తారు. పోస్టల్ బ్యాలెట్ కోసం అదనంగా మరో టేబుల్‌ను ఏర్పాటు చేశారు. కౌంటింగ్ ప్రక్రియను ఆయా సెగ్మెంట్ల రిటర్నింగ్ ఆఫీసర్లు, ఎన్నికల పరిశీలకులు అబ్జర్వ్ చేస్తారు. ఏజెంట్ల కోసం ప్రత్యేక గ్యాలరీలను ఏర్పాటు చేసి ఈవీఎంలలో ఎన్ని ఓట్లు ఎవరికి పోలయ్యాయి అనే వివరాలను వారికి చూయించి రికార్డు చేస్తారు. ఆ తర్వాత 14 టేబుళ్లలో లెక్కించిన ఓట్లను ఒక రౌండ్‌గా పరిగణించి విడుదల చేస్తారు. ప్రతి కౌంటింగ్ సెంటర్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కంట్రోల్ రూమ్ నుంచి మానిటరింగ్ చేస్తున్నారు. కౌంటింగ్ సెంటర్లలో ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. అభ్యర్థులను సెంటర్లలోని ప్రత్యేక గ్యాలరీలో కూర్చోబెట్టి వారి పర్యవేక్షణలో ఓట్లను లెక్కిస్తారు.

### కౌంటింగ్ సెంటర్ల వద్ద భారీ బందోబస్తు

మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రాల్లో కౌంటింగ్ సెంటర్ల వద్ద ఆయా జిల్లా పోలీస్ యంత్రాంగం భద్రతా ఏర్పాట్లు చేసింది. ప్రత్యేక పోలీసు దళాలను కూడా రంగంలో దింపి ఎస్పీలు భద్రతను పర్యవేక్షించనున్నారు. కౌంటింగ్ కేంద్రం రెండు కిలోమీటర్ల రేడియస్‌లో గుంపులుగా ఉండకుండా నిషేధాజ్ఞలు విధించారు. ప్రతి కౌటింగ్ సెంటర్లో మీడియా సెంటర్లు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు వివరాలు అందజేసేలా ఏర్పాటు చేశారు.

### తేలనున్న 173మంది అభ్యర్థుల భవితవ్యం

12 సెగ్మెంట్లలో ప్రధాన పార్టీల అభ్యర్థులతో కలిపి 173 మంది పోటీ చేస్తున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో త్రిముఖ పోటీ నెలకొనగా మరికొన్ని నియోజకవర్గాల్లో ముఖాముఖి పోటీ నెలకొంది. ఎవరికి వారే గెలుపు ధీమాలో ఉన్నారు. చాలా నియోజకవర్గాల్లో అభ్యర్థుల గెలుపుపై జోరుగా బెట్టింగ్‌లు కొనసాగుతున్నాయి. కౌంటింగ్ దృష్ట్యా జిల్లా కేంద్రాల్లోని అన్ని హోటళ్లు లాడ్జీలు, కౌంటింగ్ కేంద్రాల సమీపంలోని ప్రదేశాలను ముందుగానే ఆయా రాజకీయ పార్టీల కార్యకర్తలు బుకింగ్ చేసుకుని శనివారం రాత్రికి అక్కడికి చేరుకున్నారు. ఫలితాలను ఎప్పటికప్పుడు టీవీల్లో వీక్షించేందుకు, ఆన్లైన్లో అప్డేట్స్ తెలుసుకునేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. కౌంటింగ్ ప్రక్రియకు కొన్ని గంటలే ఉండడంతో అభ్యర్థుల్లో టెన్షన్ మొదలైంది. కాగా నారాయణపేట సెగ్మెంట్లో కేవలం ఏడుగురు అభ్యర్థులు పోటీ చేస్తుండగా నోటాతో కలిపి 8. కల్వకుర్తిలో 24మంది అభ్యర్థులతోపాటు నోటాతో కలిపి 25, గద్వాలలో 20మంది అభ్యర్థులు, నోటాతో 21మందివి లెక్కించాల్సి ఉంటుంది.

### గెలుపుపై ధీమాగా ఉన్న గులాబీ శ్రేణులు

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని 12 సెగ్మెంట్లలో హోరాహోరీ పోరు నెలకొంది. ఈ ఎన్నికల్లోనూ 2018 ఫలితాలే వస్తాయని బీఆర్ఎస్ నాయకులు ధీమాతో ఉన్నారు. అనేక సెగ్మెంట్లలో బీఆర్ఎస్‌ను రాజకీయంగా ఎదుర్కోలేక కాంగ్రెస్ పార్టీ అనేక కుయుక్తులను పన్నింది. కులాలు, వర్గాలు, మతాలవారీగా ఓటర్లను చీల్చింది. దీంతో ఆయా వర్గాలు కాంగ్రెస్ పార్టీ రాజకీయాన్ని అర్థం చేసుకొని గులాబీ పార్టీకి విజయాన్ని కట్టబెడుతున్నారని పార్టీ నేతలు అంటున్నారు. కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ పార్టీ హ్యాట్రిక్ విజయాన్ని సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ధీమాతో ఉన్నారు. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు మళ్లీ యథావిధిగా కొనసాగుతాయని, ప్రజలంతా తమ పార్టీని ఆశీర్వదిస్తున్నారని మహబూబ్‌నగర్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, జడ్చర్ల అభ్యర్థి లక్ష్మారెడ్డి ధీమా వ్యక్తం చేశారు.


వనపర్తిలో కౌంటింగ్‌కు ఏర్పాట్లు చేసిన అధికారులు


గద్వాలలో కౌంటింగ్‌నిర్వహణపై అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ క్రాంతి


పేటలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష


నాగర్‌కర్నూల్‌లో కౌంటింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన క్యూ లైన్


నాగర్‌కర్నూల్‌లో లెక్కింపునకు ఏర్పాట్లు చేసిన అధికారులు


గద్వాల పాలిటెక్నిక్ కళాశాలలోని స్ట్రాంగ్ రూం వద్ద పోలీసుల పహారా

| అలంపూర్ నియోజకవర్గం | |
|---|---|
| మొత్తం ఓట్లు | 2,37,938 |
| పోలైన ఓట్లు | 1,96, 307 |
| పురుషులు | 98, 786 |
| మహిళలు | 97, 519 |
| ఇతరులు | 2 |
| పర్సంటేజ్ | 82.50 |

| నారాయణపేట నియోజకవర్గం | |
|---|---|
| మొత్తం ఓట్లు | 2,31,896 |
| పోలైన ఓట్లు | 1,81,708 |
| పురుషులు | 90, 593 |
| మహిళలు | 91,114 |
| ఇతరులు | 1 |
| పర్సంటేజ్ | 78.35 |

| కల్వకుర్తి నియోజక వర్గం | |
|---|---|
| మొత్తం ఓటర్లు | 2, 41, 762 |
| పోలైన ఓట్లు | 2,01,285 |
| పురుషులు | 1,02, 739 |
| మహిళలు | 98, 546 |
| ఇతరులు | 0 |
| పోలింగ్ శాతం | 83.26 |

| దేవరకద్ర నియోజకవర్గం | |
|---|---|
| మొత్తం ఓటర్లు | 2,35,154 |
| పోలైన ఓట్లు | 1,94,543 |
| పురుషులు | 98,410 |
| మహిళలు | 96,133 |
| ఇతరులు | 0 |
| పోలింగ్ శాతం | 82.73 |

| మక్తల్ నియోజకవర్గం.. | |
|---|---|
| మొత్తం ఓటర్లు | 2,42, 254 |
| పోలైన ఓట్లు | 1, 86,860 |
| పురుషులు | 94,140 |
| మహిళలు | 92,719 |
| ఇతరులు | 1 |
| పోలింగ్ శాతం | 77.13 |

| జడ్చర్ల నియోజకవర్గం | |
|---|---|
| మొత్తం ఓటర్లు | 2,20,244 |
| పోలైన ఓట్లు | 1,79,600 |
| పురుషులు | 91,259 |
| మహిళలు | 88,337 |
| ఇతరులు | 4 |
| పోలింగ్ శాతం | 81.54 |

| గద్వాల నియోజకవర్గం | |
|---|---|
| మొత్తం ఓటర్లు | 2,57605 |
| పోలైన ఓట్లు | 2,13283 |
| పురుషులు | 1,06,262 |
| మహిళలు | 1,07,012 |
| ఇతరులు | 09 |
| పోలింగ్ శాతం | 82.42 |

| అచ్చంపేట నియోజకవర్గం | |
|---|---|
| మొత్తం ఓట్లు | 2,42,129 |
| పోలైన ఓట్లు | 1,94,077 |
| పురుషులు | 98,134 |
| మహిళలు | 95,941 |
| ఇతరులు | 02 |
| పర్సంటేజ్ | 80.03 |

| వనపర్తి నియోజకవర్గం | |
|---|---|
| మొత్తం ఓటర్లు | 2,71,151 |
| పోలైన ఓట్లు | 2,10,739 |
| పురుషులు | 1,06,606 |
| మహిళలు | 1,04,132 |
| ఇతరులు | 1 |
| పోలింగ్ శాతం | 77.72 |

| మహబూబ్‌నగర్ | |
|---|---|
| మొత్తం ఓటర్లు | 2,52,355 |
| పోలైన ఓట్లు | 1,78,429 |
| పురుషులు | 89,537 |
| మహిళలు | 88,883 |
| ఇతరులు | 09 |
| పోలింగ్ శాతం | 70.41 |

| కొల్లాపూర్ నియోజకవర్గం | |
|---|---|
| మొత్తం ఓటర్లు | 2,34,167 |
| పోలైన ఓట్లు | 1,87,087 |
| పురుషులు | 95,876 |
| మహిళలు | 91,209 |
| ఇతరులు | 2 |
| పోలింగ్ శాతం | 79.89 |

| నాగర్ కర్నూల్ నియోజకవర్గం | |
|---|---|
| మొత్తం ఓటర్లు | 2,32,780 |
| పోలైన ఓట్లు | 1,83,098 |
| పురుషులు | 93,241 |
| మహిళలు | 89,856 |
| ఇతరులు | 1 |
| పోలింగ్ శాతం | 78.66 |

# నీళ్లు నిండుగ.. ఎవుసం పండుగ

- ప్రాజెక్టుల ద్వారా పుష్కలంగా సాగునీరు
- నాడు 97,186 ఎకరాల్లో, నేడు 2,84,686 ఎకరాల్లో పంటలు
- 'గట్టు' పూర్తయితే 33 వేల ఎకరాల్లో సాగు
- గద్వాల జిల్లాలో రెండు సీజన్లు కలిపి 5,56,335 ఎకరాల్లో..
- స్వరాష్ట్రంలో సస్యశ్యామలమైన నడిగడ్డ


వానకాలం సాగు చేసిన వరి పంట (ఫైల్)

గద్వాల, డిసెంబర్ 2 : ఉమ్మడి రాష్ట్రంలో సాగు నీటి కోసం రైతన్నలు గోస అంతా ఇంత కాదు. నడిగడ్డ ప్రజలు అటు సాగు, ఇటు తాగునీటికి నోచుకోక నానా అవస్థలు పడ్డారు. సీమాంధ్రపాలనలో మన పాలకులు మంత్రులుగా ఉన్నా నీటి గోసపై మాట్లాడిన దాఖలాలు లేవు. ఆర్డీఎస్ నీటిని అటు కర్ణాటక, ఇటు సీమాంధ్ర పాలకులు అక్రమంగా తరలించుకుపోతున్నా అడిగే వారు లేరు. ప్రాజెక్టులు కట్టి వదిలేశారు. కాల్వల నిర్మాణం జరగలేదు. దీంతో పంట పొలాలకు నీరు అందకపోయేది. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల ఆర్డీఎస్ రైతులు ఆగమయ్యారు. జిల్లాలో 87,500 ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉన్నా ఏనాడు 33వేల ఎకరాలకు మించి నీరు అందలేదు. రాష్ట్ర ఏర్పాటుతో నడిగడ్డ ప్రజలకు నీటి గోస తప్పింది. తుమ్మిళ్ల, నెట్టెంపాడ్, గట్టు ఎత్తిపోతలతో గద్వాల జిల్లాలో ప్రతి ఎకరాకూ సాగునీరు అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి కేసీఆర్ అడుగులు వేశారు. ప్రయత్నాలన్నీ సఫలం కావడంతో ప్రస్తుతం నడిగడ్డ పచ్చని పైర్లతో కళకళలాడుతున్నది. నీటి సౌలభ్యం పుష్కలంగా ఉండడంతో సాగు విస్తీర్ణం మరింత పెరిగింది. కాంగ్రెస్ పాలనలో అడ్వాన్స్‌లు తీసుకుని పనులు నాణ్యతతో చేపట్టకపోవడంతో ర్యాలంపాడ్ రిజర్వాయర్ వద్ద లీకేజీలు అవుతున్నాయి. కాల్వలు అభివృద్ధి చేయకపోవడం వల్ల ప్రాజెక్టులు కట్టినా రైతులకు ప్రయోజనం లేకుండా పోయింది. రాష్ట్ర ఏర్పాటు తర్వాత తెలంగాణ ప్రభుత్వం జిల్లాలోని ప్రాజెక్టులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టడంతో సాగు విస్తీర్ణం పెరిగింది. ఆనాడు నెట్టెంపాడ్ ద్వారా 20వేల ఎకరాలకు నీరు అందించాలని ఇక్కడి పాలకులు డిజైన్ చేశారు. కానీ స్వరాష్ట్రంలో 1.60లక్షల ఎకరాలకు సాగునీరు అందుతున్నది. గతంలో జిల్లాలో 97,186 ఎకరాలకు సాగునీరు అందగా ప్రస్తుతం అదనంగా 1,87,500 ఎకరాలకు సాగునీరు అందుతున్నది. దీంతో వలసలు ఆగిపోయి ఆంధ్ర, కర్ణాటక నుంచి కూలీలు ఇక్కడికి వలసొచ్చి పనులు చేసే పరిస్థితి నెలకొన్నది.

### జవహర్ నెట్టెంపాడ్ ఎత్తిపోతల..

ఈ ప్రాజెక్టు కింద జిల్లాలోని 8 మండలాల పరిధిలో 141 గ్రామాలు లబ్ధి పొందుతున్నాయి. ఇప్పటివరకు రూ.2025కోట్లు ఖర్చు చేశారు. 2022-23 బడ్జెట్‌లో రూ.120కోట్లు కేటాయించారు. ఈ ఎత్తిపోతల నీటి లభ్యతను బట్టి 1.60లక్షల ఎకరాలకు నీటి విడుదల కొనసాగుతున్నది. రెండులక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతున్నది. రాష్ట్రం ఏర్పాటయ్యాక ఈ ప్రాజెక్టుకు ప్రభుత్వం రూ.603కోట్లు విడుదల చేయగా పనులు చివరి దశకు చేరుకున్నాయి. ఈ పనులు పూర్తయితే రెండులక్షల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉన్నది.

### నలసోమనాద్రి గట్టు ఎత్తిపోతల పథకం..

గద్వాల నియోజకవర్గంలో బీడు, కరువు పీడిత ప్రాంతాలైన గట్టు, ధరూర్, కేటీదొడ్డి, మల్దకల్ మండలాల్లో 33వేల ఎకరాలకు సాగునీరు అందించాలని ప్రభుత్వం సంకల్పించింది. ఈక్రమంలోనే ర్యాలంపాడ్ రిజర్వాయర్ నుంచి ఎత్తిపోతల ద్వారా 2.80 టీఎంసీల నీటిని తీసుకొని గట్టు ఎత్తిపోతల పథకం చేపట్టాలని రూ.581.06కోట్లకు పరిపాలన అనుమతినిచ్చింది. రూ.487.3కోట్ల పనులకు సాంకేతిక అనుమతి రాగా పనులు చకచకా నడుస్తున్నాయి. ఇలా ప్రాజెక్టుల ద్వారా పొలాలకు సాగునీరు అందిస్తుండంతో నడిగడ్డ పచ్చని పైర్లతో కళకళలాడుతున్నది.

### పెరిగిన సాగు..

జోగుళాంబ గద్వాల జిల్లాలో 2014-15 వానకాలంలో 3,23,036 ఎకరాల్లో రైతులు సాగు చేయగా 2022-23 వానకాలానికి 4,01,887 ఎకరాలకు చేరుకున్నది. అదే ఏడాది యాసంగిలో 1,04,360 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేయగా 2022-23 నాటికి 1,54,448 ఎకరాలకు పెరిగింది. 2014-15లో రెండు సీజన్లు కలిపి సాగువిస్తీర్ణం 4,27,397 ఎకరాలు కాగా 2022-23 నాటికి అది 5,56,335 ఎకరాలకు పెరిగింది. ఇది రాష్ట్ర ఏర్పాటు తర్వాత సాధించిన ప్రగతి.

### జిల్లాలో వెలుగు జిలుగులు అదనంగా 36 సబ్ స్టేషన్లు..

రాష్ట్ర ఏర్పాటుకు ముందు జిల్లాలో విద్యుత్ కోతలు, పవర్ హాలిడేలు ఉండేవి. రాష్ట్రం విడిపోతే తెలంగాణకు విద్యుత్ కష్టాలు తప్పవని సీమాంధ్ర పాలకులు ప్రజలను భయభ్రాంతులకు గురి చేశారు. అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ నాణ్యమైన విద్యుత్‌ను అన్ని రంగాలకు 24 గంటలపాటు అందిస్తున్నారు. వ్యవసాయానికి ఉచితంగా విద్యుత్‌ను సరఫరా చేస్తున్న ఏకైక రాష్ట్రంగా తెలంగాణ కీర్తి నేడు దశదిశలా వ్యాపించింది. ప్రస్తుతం జిల్లాలో కరెంటు కోతలు, పవర్ హాలిడేలకు శాశ్వత ముగింపునిచ్చి ముఖ్యమంత్రి కేసీఆర్ చరిత్ర సృష్టించాడు. రాష్ట్ర వ్యాప్తంగా 2018 జనవరి 1 నుంచి 24గంటల ఉచిత విద్యుత్ పథకం అమల్లోకి వచ్చింది. గతంలో రోజుకు సరాసరి 16లక్షల యూనిట్ల విద్యుత్ వినియోగం ఉండగా 24 గంటలు ఉచిత విద్యుత్ ఇచ్చిన తర్వాత అది 30లక్షల యూనిట్లకు పెరిగింది. దానికి తగ్గట్లుగా విద్యుత్‌లైన్లు, ఉపకేంద్రాలు ఏర్పాటు చేశారు. తెలంగాణ రాకముందు జిల్లాలో 33/11కేవీ ఉపకేంద్రాలు 34 మాత్రమే ఉండేవి. తెలంగాణ వచ్చాక అదనంగా 36 ఏర్పాటు చేయగా ప్రస్తుతం 58 సబ్‌స్టేషన్ల ద్వారా విద్యుత్‌ను అందిస్తున్నారు. మిగత వాటిలో పనులు జరుగుతున్నాయి.

### వలసల జిల్లాకే వలసలు..


జిల్లాలో నీటి సౌలభ్యం పెరగడంతో సాగు విస్తీర్ణం మరింత పెరిగింది. దీంతో ఇక్కడి వలసలు ఆగిపోయి ఆంధ్రా, కర్ణాటక ప్రాంతాల కూలీలు ఇక్కడికి వలసొచ్చి పనులు చేసుకుంటున్నారు. నడిగడ్డలో సీడ్ పత్తి సాగు ఎక్కువగా ఉండడంతో ఆగస్టు, సెప్టెంబర్‌లో ఇతర రాష్ట్ర కూలీలు ఇక్కడికొచ్చి పనులు చేస్తున్నారు. ప్రతి ఏడాది ఇతర రాష్ట్రాల నుంచి సుమారు 6-9వేల మంది కూలీలు ఇక్కడికొస్తుంటారు.


నెట్టెంపాడ్ కాల్వ ద్వారా పొలాలకు పారుతున్న నీరు

### తుమ్మిళ్ల ఎత్తిపోతలతో..

తుంగభద్రానదిపై ఉన్న సుంకేసుల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి నీటిని తుమ్మిళ్ల లిఫ్ట్ ద్వారా ఆర్డీఎస్ కాల్వ నుంచి డీ-24, డీ-40 వరకు ఉన్న 55,600 ఎకరాలకు అందించడమే లక్ష్యంగా తుమ్మిళ్ల ఎత్తిపోతలను నిర్మించారు. మొదటి దశలో రూ.397కోట్ల పరిపాలన అనుమతితో రూ.159కోట్లతో పనులు పూర్తి చేశారు. ఇది 2018 జనవరిలో అందుబాటులోకి రాగా ఆర్డీఎస్ చివరి ఆయకట్టు వరకు నీరు పారుతుండడంతో రైతులు సంబురపడుతున్నారు. ఆర్డీఎస్ ప్రాజెక్టు కింద 87,500 ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉన్నా ఏనాడూ 40వేల ఎకరాలకు మించి పారలేదు. దీంతో మిగతా ఆయకట్టు అంతా బీడుగా ఉండేది. తుమ్మిళ్ల లిఫ్ట్ ఏర్పాటుతో మిగిలిపోయిన ఆయకట్టుకు నీరు అందుతున్నది.


పత్తి పంటలో పని చేస్తున్న కర్నూల్ జిల్లా ఎమ్మిగనూర్‌కు చెందిన కూలీలు(ఫైల్)


ర్యాలంపాడు రిజర్వాయర్


జూరాల ప్రాజెక్టు

### ఆర్డీఎస్ అభివృద్ధికి నిధులు..

ఆర్డీఎస్ రైతులకు కాల్వలు సరిగ్గా లేక నీరు పూర్తి స్థాయిలో అందేది కాదు. ఆర్డీఎస్ ప్రధాన మేజర్ కాల్వ మరమ్మతుల కోసం ప్రభుత్వం రూ.12.84కోట్లతో పనులు చేపట్టింది. దీంతోపాటు 2023-24 బడ్జెట్‌లో రూ.10కోట్లు కేటాయించింది. పనులు చేపట్టి 2023-24 యాసంగిలో 33,683 ఎకరాలకు, వానకాలంలో 55వేల ఎకరాలకు నీరందేలా ప్రతిపాదించారు.

### జూరాల ప్రాజెక్టు ద్వారా..

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు కింద ఉన్న కుడి కాల్వ ద్వారా జోగుళాంబ గద్వాల జిల్లాలో 37,186 ఎకరాలకు సాగు నీరు అందుతున్నది. ఎడమ కాల్వ ద్వారా వనపర్తి ,నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలో 67,555 ఎకరాలకు సాగునీరు అందుతున్నది. 2022-23 బడ్జెట్‌లో ప్రభుత్వం రూ.10కోట్లు కేటాయించింది. ఈ నిధులతో మిగిలిపోయిన పనులు చేపడుతున్నారు.